


రజనీ మోహన్ రావు

# భర్తను లొంగదీసుకోవడం ఎలా....

**"పందిట్లో** పెళ్ళవుతోందీ, కనువిందవుతోందీ"

రికార్డు జోరుగా సాగుతోంది. 'ఏమిటే ఇంకా ముప్పయి ఏళ్ళ క్రింద, పాత చింతకాయ పాటలింకానూ—అసలే బోరుకొట్టి చస్తూంటే! విశ్వం కొద్దిగా విసుక్కున్నాడు.

పెళ్ళి అలంకారంలో ఉన్న విశ్వనాథం మనస్సు ఇంకా ఎక్కడో లగ్నమయి ఉంది. చేయవలసిందేదో త్వరగా చేయించక ఈ మైకులు, ఈ తతంగాలు అనవసరమనుకొన్నాడు. ఒకసారి వాచీ చూసుకుని, ఇంకా చీకటి పడడానికి టైమెంత పడుతుందో లెక్కవేసుకొన్నాడు. భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతోందో, లేక సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడో తెలీదు గాని, విశ్వం మనసుమటుకు పెళ్ళి కూతురు వరలక్ష్మి ఏం చేస్తున్నదో, ఎలా సిగ్గుపడుతున్నదో అని పెళ్ళికూతురి చుట్టూ తిరిగి రావడానికి వెళ్ళిపోయింది. గదిలో పడక కుర్చీలో ఏకాంతంగా అలసట తీర్చుకొంటున్నట్లు కళ్ళు మూసుకొని కూర్చున్న విశ్వనాథానికి ఏదో శబ్దమయి, బయటకు వెళ్ళిన మనసు పెళ్ళికూతురిని చూడకుండానే తిరిగి రావలసి వచ్చింది.

గామా పహిల్వాను శిష్యుడిలాగా, లావుగా, బొద్దుగా ఉండి, లాగూ, చొక్కా వేసుకొన్న పదేళ్ళ చిన్నవాడు భయం భయంగా చూస్తూ, గది లోనికి వెళ్దామా వద్దా అని ఆలోచిస్తూ గుమ్మం దగ్గరే నిల్చుని ఉన్నాడు.

"ఎవరు కావాలోయ్? లోపలికి రా." విశ్వం చిన్న ఆహ్వానం పలిచాడు.

"నేను బుచ్చిబాబునండి. ఆ ఎదురుగా ఉన్న మేడలో ఉంటున్నాను."

గళ్ళ చొక్కా వేసుకొన్న బుచ్చిబాబు విశ్వానికి ఎదురుగా వచ్చి నిల్చొని ఒక చేయి జేబుమీద గట్టిగా పెట్టి నొక్కి ఉంచడం ఏదో కొత్తగా, వింతగా కనుపించింది.

"అబ్బే! మీకు గాదండి."

విశ్వానికి కుతూహలం హెచ్చింది. "అయితే మరెవరికి?" మరొక ప్రశ్న.

"వరాలు అక్కయ్యకండి." జేబుమీద ఉన్న చేయి మరింత గట్టిగా నొక్కి పట్టుకొన్నాడు.

"ఏమిటోయ్, బుచ్చిబాబూ, అంత రహస్యంగా జేబులో పెట్టుకొని వచ్చావు? ఏమిటది?"

"మా పెద్దక్కయ్య ఎవరికీ చూపించకుండా ఈ ఉత్తరం వరాలు అక్కయ్యకు ఇచ్చి రమ్మంది" అని వెళ్ళబోయాడు.

'ఎవరికీ చూపించకుండా' అన్న ముక్క విశ్వం మీద రామబాణంలా పని చేసింది.

లేచి నిల్చొని అలమారలో ఉన్న ఒక అరటిపండు తీశాడు. బుచ్చిబాబును దగ్గరకు పిలిచి ముందు అరటిపండు ఆశ చూపించాడు. "ఆ ఉత్తరం నాకిస్తే వరాలు అక్కయ్యకు నే నిచ్చేస్తాలే. ఇటివ్వు." బుచ్చిబాబు ఏమనుకొన్నాడో, ఉత్తరం విశ్వానికి అందించి అరటిపండు ఒలవడం ప్రారంభించాడు.

20—10—82

విశ్వం అటు, ఇటు చూసి చదవడమా మానడమా అని ఒక్కక్షణం తటపటాయించి, ఒక్క చూపుతో చదివాడు.

“డియర్ వరాలూ—పూరంతా గాలించాను. ‘భర్తను లొంగదీసుకోవడం ఎలా’ అనే పుస్తకం ఎక్కడా దొరకలేదు. మరేం ఫర్వాలేదు. ఫార్ములా మరేమీలేదు. ఎంతదూరంగా ఉంచితే అంత దగ్గరవుతారు అంతే. కాస్త బెట్టుగా ఉంటే సరి. రేపు కలుస్తాలే గుడ్‌లక్! పద్మిని.”

విశ్వానికి అంతా అర్థమయిపోయింది. వరలక్ష్మి తనను గుప్పిట్లో పెట్టుకోవడానికి ఇప్పట్నించే ప్రయత్నిస్తున్నదన్న మాట. వరలక్ష్మి గురువు పద్మిని కనుపిస్తే బాగుండును. తనే ఒక లెక్చరివ్వగలడు ఈ సబ్జెక్టుమీద. ఎదురు చూస్తున్న క్షణాలు వెనక్కు పోతున్న ట్లనిపించింది. నెమ్మదిగా తేరుకొనేటప్పటికి బుచ్చిబాబు అరటిపండు ముగించి ‘నా ఉత్తరం నా కిచ్చెయ్’ అన్నట్టుగా చూస్తున్నాడు.


విశ్వం మరోసారి లేచి మరొక అరటి పండు బుచ్చిబాబుకు ఉత్తరంతోపాటు అందించి, “ఈ ఉత్తరం నాకు కాదోయ్, వరాలు లోపల ఉంటుంది ఇచ్చెయ్. నాకు చూపించినట్లు ఎవరికీ చెప్పకు” అని పంపించి వేశాడు. మరోసారి కుర్చీలో కూలబడి ఆలోచించడం ప్రారంభించాడు.

వరలక్ష్మి ఏదో ప్లానులో ఉన్నట్టుంది. రాత్రికి ఏమేం మాట్లాడాలో ఒకసారి మనసులోనే రిహార్సలు వేసుకొన్నాడు. తనే కాస్త బెట్టుగా ఉంటే వరలక్ష్మి తనంతట తానే దారికి వస్తుందనుకొన్నాడు.

విశ్వం ఎదురు చూస్తున్న క్షణం రానే వచ్చింది. అగరువత్తులు, సెంటు వాసనల మిక్స్చరు వింత వాసనలు వెదజల్లుతూంటే, విశ్వం రంగప్రవేశం గావించాడు. ‘భార్యను లొంగదీసుకోవడం ఎలా’ అన్న పుస్తకం తప్పకుండా ఎక్కడో ఎవరైనా వ్రాసి ఉంటారు. ఏది ఏమైనాసరే, తను మగవాడినని పించుకోవాలి. ఏమాత్రంమెత్తపడగూడదనుకొంటూ ఒకసారి గది అంతా కలియచూసి మంచంమీద కూర్చున్నాడు. పది నిమిషాలైనా వరలక్ష్మి రాక కనుపించలేదు. క్షణం యుగంలా గడుస్తోంది. ఎవరెవరో ఆడవాళ్ళు రావడం, పకపకలు పోవడం చికాకు అనిపించింది. బీరువామీదనున్న నవలలాంటి పుస్తకం పట్టుకొని చదువుతున్న పోజులో కూర్చున్నాడు. చెవులుమాత్రం గుమ్మంవైపు కాపు కాస్తున్నాయి. పుస్తకం చూడబోతే అప్పుడు జ్ఞాపకం వచ్చింది, కళ్ళజోడు డ్రాయింగు రూములో మరిచి పోయినట్లు. బయటకు వెళ్ళి తెచ్చుకొందామా అనుకొనేంతలో చెవులకు విందు అయింది. తలుపులు తెరిచిన చప్పుడు, పకపకలు, తలుపులు దగ్గర చేరవేసిన చప్పుడు అనుకొన్న ప్రకారం జరిగాయి. తలుపు గడియ పెట్టిన చప్పుడు మాత్రం వినిపించ లేదు.

వరాలు మంచం దగ్గరగా ఉన్న టేబిలుమీద పాల గ్లాసుపెట్టి, కిటికీ దగ్గరకు వెళ్ళి కిటికీ తెరిచి దగ్గరగా ఉన్న కుర్చీ లాక్కొని కూర్చుంది.

విశ్వం క్రీగంట చూస్తే వరలక్ష్మి మొహం




కనిపించకుండా అటువైపు త్రిప్పుకొని ఉన్నది. పెళ్ళి ముసుగు తీస్తే తప్ప మొహం కనిపించేలా లేదు. పైగా కళ్ళజోడు ఒకటి డ్రాయింగు రూములో ఉండిపోయింది. వరలక్ష్మి మరింతగా సిగ్గుపడుతుందేమోనని సరిపెట్టుకొన్నాడు.

మంచం దిగకుండానే— “హలో, వరలక్ష్మి. ఎంతసేపయింది వచ్చి” అని పలకరించాడు.

రెండు నిమిషాలు అయినా జవాబు రాలేదు.

“వరలక్ష్మి! నిన్నే! మాట్లాడవేం? మరీ అంత సిగ్గయితే ఎలా? ఏదీ ఇటు తిరిగి చూడు.” జవాబూ లేదు, తిరిగి చూడనూలేదు.

“వరలక్ష్మి! కొంపదీసి మూగదానివి కాదుకదా? సరేగాని, ఆ తలుపు గడియపెట్టు. లోపలికి ఎవరైనా వచ్చెయ్యగలరు.”

“నిన్నే, వరాలూ! మరీ అంత సిగ్గయితే కాపురం ఎలా చేస్తావు?”

“రాణిగారికి మరీ అంత సిగ్గయితే కష్టమే. మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయని భయమా?”

వరాలు నిజంగా సిగ్గుపడుతోందని నెమ్మదిగా లేచి పెద్దలైటు ఆర్పి చిన్న బెడ్ రూము లైటు వెలిగించి మరల మంచంమీద కూర్చున్నాడు.

“మనం ఎంతో మధురంగా గడపవలసిన క్షణాలు వృథా అయిపోవడం లేదూ? సమయం వృథా చేయకు.” కొద్ది స్థాయి హెచ్చిందనే చెప్పాలి.

‘ఇదంతా నీ తప్పు గాదులే. నీ గురువు పద్మిని కోచింగు కాదూ—రేపు కనిపించదా... నాలుగు ఝాడించనా’ అనుకొన్నాడు.

“అవునూ, భుజానికి సంచి తగిలించావే—ఏమిటది? బస్సు కండక్టరు లాగ. ఆ సంచి తీసి ప్రక్కనపెట్టి ఇటు రా.”

చలనం, మార్పు ఏమీ కనిపించలేదు.

“అవునూ, ఈవేళ ఏ వారం? తిథి ఏమిటి? పెళ్ళి హడావిడిలో అంతా మర్చిపోయాను.”

జవాబు సున్న.

“చల్లటి గాలి వీస్తోంది కదూ. ఆ చందమామను చూడు—ఎంత అందంగా ఉన్నాడో...”

వరాలు కదలిన శబ్దం లేదుగదా, తనవైపు తిరిగి చూడనైనా లేదు.

అసూయ ముందు, ఆడవాళ్ళు వెనక పుట్టారని ఎక్కడో చదివినట్లు జ్ఞాపకం.

“నేను కాలేజీలో చదివేటప్పుడు ఒక సంవత్సరం ఏమైందో తెలుసా? ఆ సంవత్సరం నాటకాల విభాగానికి నేను కార్యదర్శిని. వేషాలకోసం ఆడ, మగ నా చుట్టూ తెగ తిరిగేవా రనుకో. పలుకుబడి అంతా ఇంతా కాదు. మా కాలేజీ బ్యూటీ క్వీను ‘లత’ అని ఉండేది. నిజంగా లతలాగే ఉండేది. ఆ దినం నా కింకా జ్ఞాపకం. రిహార్సలు ముగించుకొని ఇద్దరం ఇళ్ళకు బయలుదేరాం. దారిలో వాన ప్రారంభించింది. ఒకప్రక్క చలి—ఇద్దరం పూర్తిగా తడిసి పోయాం. కనుచూపు మేరలో ఎవరూ రాలేదు. కటిక చీకటి—లత నాకు దగ్గరగా జరిగింది...”

కొద్దిగా వూపిరి పీల్చుకొన్నాడు విశ్వం. వరాలు కనీసం వూకొట్టడం లేదు. తర్వాత ఏమైందని అడుగుతుందేమోనని ఎదురు చూసిన విశ్వానికి నిరుత్సాహమే మిగిలింది.

చూసిన పాత సినిమాలు జ్ఞాపకం తెచ్చుకొన్నాడు ఏమైనా మంచి డైలాగులు దొరుకుతాయేమోనని. ఒక్కటీ జ్ఞాపకం రాలేదు. పోనీ, ఏదైనా డ్యూయెట్ అందుకుందామా అంటే డ్యూయెట్లు రావు. పోనీ, మరేదైనా పాట పాడుదాం సినిమాలోలాగ అనుకుంటే, “జనగణమన అధినాయక జయహే...” జాతీయగీతం తప్ప మరొక పాట రాదు.

ఎలా మాట్లాడినా రియాక్షను రాకుండా ఉంది. ఇదంతా పద్మినీదేవి కోచింగు ప్రభావమా?

“శంకరాభరణంలో నీకు ఏ పాట నచ్చింది?”

మామూలుగానే జవాబు సున్న. కనీసం దించిన తల

అయినా ఎత్తడం లేదు. ఇటు తిరిగి మొహమైనా చూపించడం లేదు. మరీ బొత్తిగా అన్యాయం— సంగీత జ్ఞానం బొత్తిగా లేనట్లుంది.

"క్రిందటి నెల ఒకసారి పార్టీకి వెళ్ళి జానీ వాకర్ ఫుల్ బాటిలు సేవించిన తర్వాత రమ్మీ ఆడడం మొదలుపెట్టాను. ఒక్క మూడు గంటల సిట్టింగులో నాలుగు వందలు పోయింది. అయినా..."

మొహమెత్తి ఆశ్చర్యంగా చూడడమో, లేక గుక్కపట్టి ఏడుస్తుందేమోనని అనుకొంటే, విట్టూర్పు శబ్దం కూడా వినిపించలేదు. విశ్వానికి కొద్దిగా వోర్పు సడలింది.

కంఠస్థాయి పెంచి చూదామనుకొన్నాడు గాని, ఎవరైనా వింటారేమోనని భయం వేసింది.

"చూడు, వరాలూ—పెళ్ళికి నీకు అమెరికన్ నైలెక్సు చీరలు ఏమైనా కొన్నారా? లేదంటే చెప్పు— రేపుగాని, ఎల్లుండిగాని బజారుకు వెళ్ళి అరడజను తీసేద్దాం..."

లంచం ప్రయోగం విఫలం...

"ఉదయం భోజనాల సమయంలో ఎర్ర చీర కట్టుకొని పెరుగు వడ్డించిన అమ్మాయి ఎవరు ? చాలా అందంగా ఉందికదూ? అయినా నీ అందం ముందు ఆ అందమెంతలే!"

పొగడ్త పగలలేదు.

రెండు నిమిషాలు నిశ్శబ్దం. ఎవరూ మాట్లాడ లేదు. దప్పిక వేసింది. మంచినీళ్ళు త్రాగి మాట్లాడ దామనుకొన్నాడు. కాదు, ఇనుము ఎర్రగా కాలి ఉన్నప్పుడే సమ్మెటతో కొట్టమని సామెత. వ్యవధి ఎక్కువ ఇస్తే ఇంతవరకు ప్రయత్నించినదంతా వ్యర్థమై పోవచ్చు.

ఒకసారి నాలికతో పెదాలు తడుపుకొన్నాడు.

"అసలే నా కళ్ళజోడు డ్రాయింగు రూములో మర్చిపోయి అవస్థపడుతున్నాను. ఇందాకట్నుంచీ చూస్తున్నాను. నేను ఒకడ్నే ఏదో కాపురం చేయ బోయేటట్లు అవస్థపడుతున్నాను. అంతా వన్ వే ట్రాఫిక్‌లా గడగడ మాట్లాడుతున్నాను. ఏక పాత్రాభినయంలోలా అన్నీ నేనే మాట్లాడు తున్నాను. ఆ పంచి తగిలించుకొని కూర్చోకపోతే ఇంతంత మాట్లాడుతూ ఉంటే ఇరవై నిమిషాల నుంచీ ఉలకవు, పలకవు. ఇదేనా తాళిగట్టిన భర్తకు చూపవలసిన మర్యాద? మరికొంచెం సేపయితే నాకు పిచ్చి ఎత్తేలాగుంది." ఈ దెబ్బకు దయ్యం వదులుతుందనుకొన్నాడు.

దయ్యం వదలడం కాదు గాని, వరాలు నెమ్మ దిగా భుజాన ఉన్న పంచి సవరించుకొంటూ తన వైపు చూడనైనా చూడకుండా నెమ్మదిగా నడచి తలుపు తీసుకొని వెళ్ళిపోయింది. విశ్వానికి ముచ్చె మటలు పోశాయి.

'వరాలు బయటకు ఎందుకు వెళ్ళిపోయినట్లు? మొగుడు హైరానుమెంటు పడలేకున్నాడని అత్త గారికి కంప్లెయింటు ఇస్తుందా? మరీ ఇంత సున్నితమని తను అనుకోలేదు. వెళ్ళిపోతుంటే తను వారించనూలేదు. డ్రాయింగు రూముకు తన కళ్ళజోడు తీసుకురావడానికి వెళ్ళిందా ? బయటకు వెళ్ళి అత్తగారిని అమ్మాయిని మరో సారి లోపలికి పంపమని అడగడమా? లేక నెమ్మ దిగా తలుపులు వేసుకొని కాళ్ళు ముడుచుకొని పడుకోవడమా? ఇవన్నీ జరగని పనులే — జరగ కూడని పనులే. వరాలు గురువు ఏం నూరిపోసిందో గాని తన కింత అనవసర ప్రయాస. ఇప్పుడేమిటి చేయడం?'

వరాలు మరోసారి పాల గ్లాసుతో ప్రవేశం. విశ్వం నోరు తెరిస్తే ఒట్టు. గుండె దడ దడ క్లియరుగా వినిపిస్తోంది. నేరుగా పాల గ్లాసుతో మంచం వద్దకు వచ్చి పాల గ్లాసును అంతకు ముందు ఉన్న పాల గ్లాసు ప్రక్కన పెట్టింది. క్రిందకు వంగి తన పాదాలు ముట్టుకొని కళ్ళ కద్దు కొంది.

ఆశ్చర్యపడుతున్న విశ్వం వరాలు పాదాభి వందనం చేస్తుంటే కాళ్ళు పట్టుకొని లాగేసి క్రింద పడవేయదుగదా— ఎందుకయినా మంచిదని కాస్త నిల్రదొక్కుకొని నిలబడ్డాడు.

ఆశ్చర్యంలోంచి కొద్దిగా తేరుకొని.

"అయినా ఈ రాత్రికి ఇద్దరం ఒకే గ్లాసులో పాలు త్రాగాలిగదా—రెండు గ్లాసుల పాలు పట్టుకు వచ్చావేం" అని సూటిగా తన శృంగార జ్ఞానం ఒలి కించాడు.

వరలక్ష్మి ఈసారి తల ఎత్తి ఎగాదిగా చూసింది.




"నేను పట్టుకు వచ్చింది ఒక పాలగ్లాసు మాత్రమే. ఆ గ్లాసు ముందే ఎవరో పెట్టి ఉంటారు. పోనీలెండి, ఇప్పుడు వచ్చిన నష్ట మేముంది?"

ఈసారి విశ్వానికి పిచ్చెత్తినట్లయింది. 'ఇంతకు ముందు—అరగంట ముందు పాలగ్లాసు ఒకటి పెట్టి ఇప్పుడు ఏమీ ఎరగనట్లు మాట్లాడు తుందేమిటి? ఏదైనా జోకు వేస్తూందా? అబద్ధం చెప్పవలసిన అవసరం లేదు. తను అంతకుముందు దయ్యాల నవల ఏదో చదివినట్లు జ్ఞాపకం. అందులోనూ మొదటి రాత్రి ఒక దయ్యం పెండ్లి కూతురి వేషంలో వచ్చి గలభా చేయడం...అంతే! విశ్వానికి ముచ్చెమటలు పోయ నారంభించాయి. పెదాలు తడి ఆరిపోయాయి. ఎందుకయినా మంచి దని వరాలు కాళ్ళు వెనక్కి తిరిగి ఉన్నాయేమోనని ఒక ప్రదక్షిణం చేసి చూసినా కాళ్ళు అసలే కనిపించలేదు, చీర మరింత క్రిందకు కట్టి ఉండడం మూలాన. గభాలున క్రిందకు వంగి, చీర ఎత్తి కాళ్ళు సరిగా ఉన్నాయో లేదో చూదామంటే మరింత అల్లరిపాలు కావచ్చునని ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు.

"అరగంట ముందు వచ్చి అంత మౌనవ్రతం ప్రదర్శించి వెళ్ళిపోయి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు మాట్లాడతావేమిటి, వరాలూ?"

అప్పుడు ఆశ్చర్యపడడం వరాలు వంతు అయింది. "ఏమండీ ఇంతకుముందు వచ్చిన వరలక్ష్మి చేతిలో ఏమైనా ఉందా? మీ రేమైనా ఆ వరలక్ష్మిని ముట్టుకొన్నారా?"

"ఇంకా నయం—ఏమైనా చేశారా అని అడిగావు కాదు. ఎవరు వరలక్ష్మి, ఎవరు డూప్లికేటు అని తెలియక చస్తుంటే..."

"ఇదిగోనండీ మీ కళ్ళజోడు. డ్రాయింగు రూమ్‌లో పెడితే పిల్లలు ఎవరో దాచేశారు. మీ అమ్మగారు తీసి నా కిచ్చారు మీ కిమ్మని.

ముందు వచ్చిన వరలక్ష్మితో ఏమైనా తప్పుడుగా మాట్లాడారా?"

విశ్వం ప్రశ్నలు ఇక భరించలేకపోయాడు. తనకు ఎక్కడలేని సస్పెన్సు మిస్టరీ. దానికితోడు వరాలు ప్రాసిక్యూషన్ ప్రశ్నలు.

"చూడు, వరాలూ. మొదటి వరలక్ష్మి ఎవరు? ఎవరు నా భార్య? నే నెవరికి మొగుణ్ణి? ఏమిటి ఇదంతా అయోమయంగా ఉంది?"

"మొదటి వచ్చిన వరలక్ష్మికి మీరు వరసకు బావగారవుతారు. వాడు శేషగిరి—మా పిచ్చికొడుకు. నాటకాల రాయుడు. వాడు తగిలించుకొన్నది బస్సు కండక్టరు సంచిలోది చిల్లర కాదు. అందులో మినీ టేపు రికార్డరు ఉంది. అయినా మీరు ఎక్కువ ఏమైనా నేనే అనుకొని మాట్లాడారా?..."

విశ్వానికి కళ్ళు తిరిగి పడిపోతున్నాడేమో అని పించింది.

"అన్యాయం, అక్రమం. నా భార్య వేషం వేసి, నా మాటలన్నీ రికార్డు చేసి ఉంటాడు. వాడిని ఎముకలు ఏరేస్తాను—ఏమనుకొంటున్నాడో..."

"చాల్లెండి ఎవరైనా వింటే నవ్వుతారు. పగటి వేషగాడో, పెళ్ళామో గూడా గుర్తుపట్టలేకపోయా డని ఎగతాళి చేయరూ...పోనీలెండి, ఇప్పు డెందుకా గొడవ? మరచిపొండి."

"ఎలా మరచిపోవడం? టేపు మరొకరి చేతిలో పడితే వాడు నా టోపు లేపేయడూ? అసలే నాకు గుండెదడ. ఆ టేపు సంపాదించే మార్గం చెప్పు, వరాలూ." దీనంగా అడిగాడు. వరాలు చెక్కు చెదర లేదు.

"ఆ టేపు మా కాలేజీ కుర్రకుంకలు వింటే ఇంకేమైనా ఉందా? కాలేజీలో ఇక అడుగు పెట్టగలనా? 'లెక్చరరు గారి మొదటి రాత్రి పాట్లు' అంటూ నన్ను గోడలమీద కెక్కించెయ్యరూ" అంటూ విశ్వం వరాలు రెండు చేతులూ పట్టు కొన్నాడు.

"సరేలెండి—పాలు త్రాగండి" అంటూ గ్లాసు నోటి కందించింది. విశ్వానికి పాలు త్రాగాలనిపించ లేదు.

"మీరు మరీ కంగారు పడనవసరంలేదు. శేషగిరి ఇంతకుముందే ఎదుటివారికి తెలియకుండా మాటలు రికార్డుచేసి ఏడిపించిన సంఘటనలు రెండు, మూడు ఉన్నాయి. సాయంకాలంనుండీ టేపు రికార్డరు భుజాన తగిలించుకొని తిరుగు తూంటే, వీడేదో మళ్ళీ అఘాయిత్యం చేస్తాడని నాకు అనుమానం వచ్చింది. భోజనాల టైములో టేపు రికార్డరు అలమార మీద ఉంటే నేను బేటరీలు తీసి వాడికి తెలియకుండా దాచేశాను లెండి. అందులో ఏమీ రికార్డు అయి ఉండవు. మీరు నిశ్చింతగా ఉండవచ్చు."

విశ్వం దీర్ఘంగా నిట్టూర్పు వదలి, తృప్తిగా గుండె నిండా వూపిరి పీల్చుకొన్నాడు.

"అవునూ, మీ పిచ్చి కొడుక్కి అదేం పోయే కాలం? ఆకలితో ఉన్న సింహం గుహలో ప్రవేశించి పరాచికాలాడడం రిస్కు కాదూ! నేను కంగారుపడి ఏమైనా చేసి ఉంటే...అయినా పద్మిని ఎవరు? 'భర్తను లొంగదీసుకోవడం ఎలా' అని పుస్తకాలు చదవకపోతే నన్నడిగితే నేను నేర్పించనూ..."

"చాల్లెండి ఇటువంటి భారీ డైలాగ్సు మాట్లాడు తారనే శేషగిరి రిస్కు తీసుకుని ఉండవచ్చు. అయినా మీరు నా ఉత్తరం చదవడ మేమిటి? బుచ్చిబాబు చెప్పాడులెండి."

విశ్వానికి మాట పెగలలేదు.

నెమ్మదిగా, నీరసంగా "నీ ఉత్తరం, నా ఉత్తరం అని మనలో మనకు ఏమిటి? మన ఉత్తరం అనక..." నవ్వలేక నవ్వేడు.

ఒక్కసారి విశ్వం ముఖ కవళికలు మారేయి. సీరియస్‌గా తన జడలోని ఎత్తుగా ఉన్న పువ్వులను చూడడం గమనించింది.

"ఏమిటి అంత తీక్షణంగా చూస్తున్నారు? పువ్వులు మీరు ఎప్పుడూ చూడనట్లు?"

"ఏమో, అన్ని పువ్వులు ఉంటే అందులో గాని మరేదైనా మినీ టేపు రికార్డరు ఉందేమోనని అనుమానంగా..."

"అయినా ఎదురుగా ఉన్న భార్యను గుర్తు పట్టలేకపోతున్నారు పువ్వుల్లో ఉన్న టేపు రికార్డరు మీకేం కనిపిస్తుంది? అయినా అనుమానం ఎందుకు" అంటూ వరాలు విశ్వం గుండె చేరు వకు చేరింది, జడలోని పూవులు విశ్వం మొహం దగ్గరగా వచ్చేటట్లు. అంతే—ఆ మల్లెల వాసనలో విశ్వం టేపు రికార్డరు, టేపు సంగతి మరచి పోయాడు.

తనకు శేషగిరి అనబడే పిచ్చికొడుకు లేడని, టేపురికార్డరు అసలే లేదని మరునాటి దినం చెప్పొచ్చు ననుకొంది వరాలు, విశ్వం మూడ్ పాడు చేయడం ఇష్టంలేక. ★

